Web & Epaper : www. aksharasodhana.com

# అక్షర శోధన

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం

తెలుగు దినపత్రిక

గురువారం, 29 మే 2025 సంపుటి : 02 సంచిక : 94 పేజీలు : 4 వెల : 2/-    Web& Epaper : www. aksharasodhana.com

## ‘అదృశ్య శత్రువులు’

### – శుక్ర గ్రహం మాటున ప్రమాదకర గ్రహశకలాలు



**న్యూఢిల్లీ :** మన సౌర కుటుంబంలో భూమికి పొరుగున ఉన్న శుక్రగ్రహం సమీపంలో కొన్ని ప్రమాదకర గ్రహశకలాలు పరిభ్రమిస్తున్నాయని, అవి మన గ్రహానికి తీవ్ర ముప్పు తెచ్చిపెట్టగలవని శాస్త్రవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సూర్యుడి ప్రచండమైన కాంతి వల్ల, భూమి నుంచి చూసినప్పుడు శుక్రగ్రహం అడ్డుగా ఉండటం వల్ల ఈ ‘అదృశ్య శత్రువుల’ను గుర్తించడం అత్యంత కష్టతరంగా మారిందని వారు విశ్లేషిస్తున్నారు. ఈ గ్రహశకలాలు, శుక్రుడితో పాటు సూర్యుని చుట్టూ తిరుగుతున్నప్పటికీ, వాటి కక్ష్యలు అస్థిరంగా ఉండటం ప్రధాన సమస్య. ఈ అస్థిరత్వం కారణంగా, అవి తమ మార్గాన్ని మార్చుకుని అనూహ్యంగా భూమి కక్ష్య వైపు దూసుకువచ్చే ప్రమాదం పొంచి

2లో..

# రైతుభరోసాపై బిగ్ అప్డేట్

### – అనుకున్న సమయానికే నిధులు విడుదల చేస్తామన్న మంత్రి



**హైదరాబాద్** తెలంగాణ రాష్ట్రంలో రైతులకు అందించే రైతు భరోసా పథకంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రకటన చేశారు. ఇప్పటివరకు 3.5 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు మాత్రమే ఈ పెట్టుబడి సాయం అందించగా మరో పది రోజుల్లో 4 ఎకరాలు లేదా అంతకంటే ఎక్కువ భూమి ఉన్న రైతుల ఖాతాల్లోనూ నిధులు జమ చేస్తామని మంత్రి వెల్లడించారు. ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ రైతుబంధు పథకం స్థానంలో రైతు భరోసా పేరుతో ఈ పథకాన్ని అమలు చేస్తోంది. తాము అధికారంలోకి వస్తే ఎకరానికి రూ.15 వేలు చొప్పున ఏటా పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రైతులకు హామీ ఇచ్చింది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేకపోవడంతో ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని తర్వాత ప్రకటించింది. ఈ నిధులను ఎకరాకు రూ.6 వేలు చొప్పున రెండు విడతలుగా (ఖరీఫ్, రబీ) రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నారు. ఇప్పటివరకు 3.5 ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు సుమారు రూ. 4,000 కోట్లను ప్రభుత్వం ఇప్పటికే జమ చేసింది. తాజా ప్రకటనతో భూమి పరిమితిని పెంచడం ద్వారా మరింత మంది రైతులు ఈ పథకం కింద లబ్ధి పొందనున్నారు. అంటే దాదాపు 4 ఎకరాల నుంచి 10 ఎకరాలలోపు భూమి ఉన్న రైతులకు ఈ నిధులు జమ చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇది రాష్ట్రంలోని సన్నకారు, చిన్నకారు రైతుల ఆర్థిక భారాన్ని తగ్గించి పంట పెట్టుబడులకు చేయూతనిస్తుంది. రాష్ట్రంలో ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు హామీ ఇచ్చారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఆయన భరోసా కల్పించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

అంతేకాకుండా రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు త్వరలోనే ఆయిల్ పామ్ మిల్లును ఏర్పాటు చేస్తామని మంత్రి ప్రకటించారు.

రైతులు సాంప్రదాయ పంటలైన వరి, మొక్కజొన్నలకే పరిమితం కాకుండా మార్కెట్ డిమాండ్ ఉన్న కొత్త పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఆయిల్ పామ్, ఇతర ఉద్యాన పంటల సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని, దీనికి అవసరమైన సాంకేతిక సాయం, మార్కెటింగ్ సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. ఇది రైతుల ఆదాయాన్ని పెంచడమే కాకుండా, వ్యవసాయ వైవిధ్యాన్ని ప్రోత్సహిస్తుంది.

## పాక్ వెన్నులో వణుకు పుట్టించేలా

### – సరిహద్దుల్లో మాక్ డ్రిల్స్




**న్యూఢిల్లీ** జమ్మూ కాశ్మీర్ పహల్గామ్ ఉగ్రవాదుల దాడి అనంతరం భారత్–పాకిస్తాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. యుద్ధ వాతావరణం కొనసాగుతోంది. పాకిస్తాన్ భూభాగంపై నుంచి చొరబాట్లు సైతం చోటు చేసుకుంటోండటంతో భారత ఆర్మీ అప్రమత్తంగా ఉంటోంది. రెప్ప వాల్చకుండా పహారా కాస్తోంది. ఈ పరిణామాల మధ్య కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయాన్ని తీసుకుంది. పాకిస్తాన్ సరిహద్దుల్లో సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్స్ నిర్వహించనుంది. దీనికి తేదీని కూడా ఖరారు చేసింది. నేడు సాయంత్రం 5 గంటలకు భారత్– పాక్ సరిహద్దు పొడవునా ఈ మాక్ డ్రిల్స్ ఉంటాయి. బ్లాక్ అవుట్ సైతం చేపడతారు. కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూ కాశ్మీర్ తో పాటు నాలుగు రాష్ట్రాలు హర్యానా, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ పాకిస్తాన్ సరిహద్దులను పంచుకుంటోన్న విషయం తెలిసిందే. ఆయా రాష్ట్రాలన్నింట్లోనూ నేడు సాయంత్రం 5 గంటలకు ఈ పూర్తిస్థాయి సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్స్ ను కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. జమ్మూ కాశ్మీర్ లో నియంత్రణ రేఖతో పాటు అంతర్జాతీయ సరిహద్దు పొడవునా మాక్ డ్రిల్స్ నిర్వహిస్తుంది భారత ఆర్మీ. అచ్చంగా పూర్తిస్థాయి యుద్ధాన్ని పోలిన విధంగా ఉండబోతోందిది. ఆర్మీ, వాయుసేన, నౌకాదళం ఇందులో పాల్గొంటుంది. గుజరాత్ వరకు నేవీ మాక్ డ్రిల్స్ ఉంటాయి. ఇక మిగిలిన చోట్ల ఆర్మీ, వైమానిక దళం భాగస్వామ్యమౌతుంది. శతృవులు ఎదురుగా నిల్చున్నప్పుడు వారిని ఎలా ఎదుర్కోవాలి.? అత్యవసర పరిస్థితులను ఎలా అధిగమించాలి.?

2లో..

## యుద్ధం ఆపడానికి ఉక్రెయిన్‌కు కండిషన్లు

### – నాటో విషయంలో షరతులు పెట్టిన పుతిన్



**మాస్కో** గత మూడేళ్లుగా కొనసాగుతున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి తెరదించే దిశగా కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ భీకర పోరును ఆపేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తాజాగా అంగీకరించినట్లు తెలుస్తోంది. అయితే, ఇందుకు ఆయన పలు కఠినమైన షరతులు విధించినట్లు రాయిటర్స్ వార్తా సంస్థ తన కథనంలో పేర్కొంది. ఉక్రెయిన్ ఎట్టిపరిస్థితుల్లోనూ నాటో కూటమిలో చేరకూడదన్నది పుతిన్ ప్రధాన డిమాండ్‌గా ఉంది. నాటో విస్తరణను తక్షణమే నిలిపివేయాలని, ఈ మేరకు లిఖితపూర్వక హామీ ఇవ్వాలని ఆయన కోరుతున్నారు. ఉక్రెయిన్‌తో పాటు జార్జియా, మోల్డోవా వంటి మాజీ సోవియట్ దేశాలకు నాటో సభ్యత్వం ఇవ్వకూడదని కూడా స్పష్టం చేసినట్లు సమాచారం. వీటితో పాటు, ఉక్రెయిన్ తటస్థంగా వ్యవహరించాలని, రష్యాపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని, స్తంభింపజేసిన రష్యన్ ఆస్తుల సమస్యను పరిష్కరించాలని, ఉక్రెయిన్‌లోని రష్యన్ మాట్లాడే ప్రజలకు రక్షణ కల్పించాలని

2లో..

## చదువుతోనే ఉన్నత శిఖరాలు సాధ్యం



- అంబేద్కర్ రాజ్యాంగం ప్రకారమే రిజర్వేషన్లు అన్న రేవంత్ రెడ్డి
- ఎస్సీ, ఎస్టీలను పాలకులుగా మార్చింది కాంగ్రెస్సేనని వ్యాఖ్య
- మాజీ సీఎం ఇంట్లోవాళ్లకే ఉద్యోగాలు ఇచ్చుకున్నారు
- గత ప్రభుత్వం పేదలకు ఉద్యోగాలు ఇవ్వలేదని సీఎం విమర్శ
- ఉద్యోగ నియామకాలపై కుట్రలు జరుగుతున్నాయని ఆరోపణ

**హైదరాబాద్** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి అనుగుణంగానే రాష్ట్రంలో రిజర్వేషన్లను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో జరిగిన గురుకుల అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలను పాలకులుగా తీర్చిదిద్దిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన పేర్కొన్నారు. చదువుకు ఉన్న ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ, “చాలామంది మహనీయులకు గుర్తింపు తెచ్చింది కులం కాదు, చదువు మాత్రమే. ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే చదువుతోనే సాధ్యమవుతుంది” అని సీఎం అన్నారు. సమాజంలో నెలకొన్న రుగ్మతలు, అసమానతలను నిర్మూలించాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. కోఠిలోని మహిళా కళాశాలకు వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టి గౌరవించుకున్నామని గుర్తుచేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఒక విద్యార్థి చదువు, ఆరోగ్యం బాగుండాలంటే, వారు చదువుకునే పరిసరాలు, మౌలిక సదుపాయాలు కూడా అంతే ముఖ్యమని సీఎం వ్యాఖ్యానించారు. గత పాలకుల వైఖరిని విమర్శిస్తూ, “ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లలకు చదువులు వద్దని, వారు కులవృత్తులు మాత్రమే చేసుకోవాలని గత పాలకులు భావించారు. దళితులు, బీసీలు గొర్రెలు, బర్రెలు, చేపలు పెంచుకుంటూ ఉండాలన్నట్టుగా మాజీ సీఎం వ్యవహరించారు” అని రేవంత్ రెడ్డి ఆరోపించారు.తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయని ఆశించిన యువత ఆశలపై గత ప్రభుత్వం నీళ్లు చల్లిందని

2లో..

## కాంగ్రెస్ నేతలతో ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి భేటీ

### – పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమీక్షలు



**హైదరాబాద్** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ప్రస్తుతం హైదరాబాద్‌లో పార్టీ నేతలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీ బలోపేతం, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పనితీరుపై ఆమె సమీక్షలు జరుపుతున్నారు. హైదర్‌గూడలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయం ఈ సమీక్షలకు వేదికైంది. పార్లమెంట్ నియోజకవర్గాల ప్రాతిపదికన జరుగుతున్న ఈ భేటీలలో మంత్రులు, శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులతో ఆమె చర్చలు జరుపుతున్నారు. పార్టీ కార్యక్రమాల అమలు, ప్రజా సమస్యలపై స్పందన వంటి అంశాలపై ప్రధానంగా చర్చిస్తున్నట్లు సమాచారం. బుధవారం నాడు

2లో..

## చిన్నారులపై అఘాయిత్యాలు ఇంకా ఎంతకాలం?

### – కడప జిల్లా ఘటనపై పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి




**అమరావతి** వైఎస్ఆర్ కడప జిల్లా మైలవరం మండలం కంబాలదిన్నె గ్రామంలో నాలుగు రోజుల క్రితం జరిగిన మూడేళ్ల చిన్నారిపై అత్యాచారం, హత్య ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అభం శుభం తెలియని పసిమొగ్గపై బంధువుగా చెప్పబడుతున్న వ్యక్తే ఈ ఘాతుకానికి పాల్పడటం సభ్య సమాజం సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయమని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వార్త తన హృదయాన్ని తీవ్రంగా కలచివేసిందని, సమాజంగా మనం ఎక్కడ విఫలమవుతున్నామనే ప్రశ్న మన ముందు నిలిచిందని

2లో..

## మణిపూర్‌లో వరుసగా మూడు భూకంపాలు

### – అత్యధికంగా 5.2 తీవ్రతతో భూకంపం



**ఇంఫాల్** ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో బుధవారం వరుస భూకంపాలు సంభవించాయి. స్వల్ప వ్యవధిలో మూడుసార్లు భూమి కంపించడంతో ప్రజలు కొంత ఆందోళనకు గురయ్యారు జాతీయ భూకంప అధ్యయన కేంద్రం (నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ) తెలిపిన వివరాల ప్రకారం, బుధవారం తెల్లవారుజామున 1:54 గంటలకు చురాచాంద్‌పూర్ జిల్లాలో మొదటి భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.2గా నమోదైంది. ఇది ఈరోజు సంభవించిన భూకంపాల్లోకెల్లా శక్తివంతమైనది. ఆ తర్వాత, తెల్లవారుజామున

2లో..

## కాళేశ్వరం పుష్కరాలకు భారీ ఆదాయం

### – 12 రోజుల్లో 2 కోట్లు దాటిన రాబడి



**హైదరాబాద్** కాళేశ్వరంలో 12 రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగిన సరస్వతీ నది పుష్కరాలు గత సోమవారం (మే 26) సాయంత్రం 4 గంటలకు శాస్త్రోక్తంగా ముగిశాయి. ఈ పుష్కరాలకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఝార?ండ్ తదితర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి, కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. పుష్కరాల ముగింపు

2లో..

# ఎస్సై భార్గవ్‌పై రాష్ట్ర, జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు

- దళితుడైన మహేందర్ ను చితకబాదిన ఎస్సై భార్గవ్ పై పిర్యాదు
- వెంటనే స్పందించిన జాతీయ ఎస్సీ కమిషన్ నోటీసులు జారీ
- తెలంగాణ అడిషనల్ డీజీపీ, లా అండ్ ఆర్డర్, కరీంనగర్ సీపీకి నోటిసులు
- ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత డిమాండ్
- రూరల్ సీఐ, ఇంటెలిజెన్స్ పోలీస్ లు ఎస్సై భార్గవ్ ను కాపాడే ప్రయత్నం..!
- టిపిసిసి ఎస్సీ డిపార్ట్మెంట్ అట్రాసిటీ రాష్ట్ర ఇంచార్జి తిప్పారపు సంపత్



**అక్షర శోధన న్యూస్ : మే 29 హుజురాబాద్** నిరుపేద దళితుడైన బత్తుల మహేందర్ పైన అకారణంగా ఎస్సై భార్గవ్ చితకబాదిన విషయంలో రెండు వారాలు గడుస్తున్నా ఇంతవరకు చర్యలు చేపట్టని పోలీసులు. ఈ మేరకు బుధవారం హుజురాబాద్ పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ మేరకు టిపిసిసి ఎస్సి డిపార్ట్మెంట్ అట్రాసిటీ రాష్ట్ర ఇంఛార్జి తిప్పారపు సంపత్ మాట్లాడుతూ.. విద్యావంతుడు (పీజీ) బత్తుల మహేందర్ పై డ్రంక్ అండ్ డ్రైవ్ పేరుతో సైదాపూర్ ట్రైనింగ్ ఎస్సై భార్గవ్ అహంకార ధోరణితో మహేందర్ ను చితక బాధిన విషయం అందరికి తెలిసిందే. అకారణంగా రెండు చెవుల కర్ణభేరీలు పగిలిపోయేలా చెవుల మీద కొట్టడం జరిగింది. ఈ మేరకు మహేందర్ రెండు చెవులు వినబడడం లేదు. గత 15 రోజుల నుండి కొంతమంది పోలీస్ అధికారులు ఎస్ఐ భార్గవ్ ను కాపాడే ప్రయత్నం చేస్తూ, సిపికి తప్పుడు సమాచారంతో పాటు తప్పుడు నివేదికలు ఇస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర జాతీయ ఎస్సీ కమిషన్ కు ఫిర్యాదు చేయడం జరిగిందని, దళితుడైన మహేందర్ దెబ్బలు చూసి జాతీయ ఎస్సీ కమిషన్ వెంటనే స్పందించి తెలంగాణ అడిషనల్ డిజిపి, లా అండ్ ఆర్డర్ , కరీంనగర్ సీపీ లకు వెంటనే నోటీస్ లు ఇవ్వడం జరిగింది.

ఎస్సై భార్గవ్ పై ఏం చర్యలు తీసుకున్నారో.. నివేదిక ఇవ్వాలని కోరడం జరిగింది. దళితుడైన బత్తుల మహేందర్ పై దాడిని మా దళిత సమాజంపై దాడిగా భావిస్తున్నామని, స్వాతంత్రం వచ్చి డెబ్బై ఏండ్లు గడిచిన కూడా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, ప్రజలను రక్షించవలసిన పోలీసులే అహంకార ధోరణితో దాడి చేస్తే ఎలా అని ప్రశ్నించారు. సైదాపూర్ ఎస్సై భార్గవ్ చేసిన పని పోలీస్ డిపార్ట్మెంట్ కే మచ్చ తెస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలాంటి వ్యక్తులపై చర్య తీసుకోకుంటే ప్రజలకు పోలీసులపై నమ్మకం పోతుందని, ప్రజలకు పోలీసులపై విశ్వాసం ఉండాలంటే నిజా నిజాలు తెలుపాలని, ఎస్ఐ భార్గవ్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ జీడి రవితేజ (న్యాయవాది), హుజురాబాద్ యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు చెల్లూరి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధి కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి...ఎంపీపీ రామాంజినమ్మ

- ఎంపీపీను ఘనంగా సన్మానించిన పంచాయతీ కార్యదర్శులు.
- మండల స్థాయిలో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం.
- ప్రశాంతంగా ముగిసిన మండల సర్వసభ్య సమావేశం.






**తుగ్గలి:** మండల అభివృద్ధి కొరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తుగ్గలి మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు రామాంజనమ్మ తెలియజేశారు.బుధవారం రోజున మండల కేంద్రమైన తుగ్గలిలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు అధికారుల,ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు రామాంజినమ్మ అధ్యక్షతన మొదటిసారి మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు తమ నివేదికలను సభాముఖంగా వివరించారు. అదేవిధంగా గత మూడు నెలల్లో నిర్వహించనున్న ప్రభుత్వ కార్యకలాపాలు గురించి వారు వివరించారు.మొదటగా మండల సర్వసభ్య సమావేశంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు.అనంతరం మండల అధ్యక్షురాలు రామాంజినమ్మ కు మరియు మండల అధ్యక్షుల గౌరవ సలహాదారులు హనుమంతులకు మండల పంచాయతీ కార్యదర్శులు శాలువాను కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.అనంతరం మండల అధ్యక్షురాలు రామాంజనమ్మ మాట్లాడుతూ మండల అభివృద్ధి కొరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె తెలియజేశారు.అధికారులందరూ పార్టీలకతీతంగా ప్రజలకు సేవలందించాలని ఆమె తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పులికొండ నాయక్,వైస్ ఎంపీపీలు మల్లికార్జున రెడ్డి,ఎర్ర నాగప్ప,ఎంపీడీవో విశ్వమోహన్,ఈఓఆర్డి శ్రీహరి,ఆర్ఐ వెంకటరాముడు,జూనియర్ అసిస్టెంట్ రాంబ్రహ్మం,సిడిపిఓ లలిత,ఏపీఓ హేమ సుందర్, ఏపీఎం రాధాకృష్ణ,ఏవో పవన్ కుమార్,పశువైద్యాధికారిని ప్రణీత, ఆయుర్వేద డాక్టర్ అమర్నాథ్,ఎంఈఓ రమా వెంకటేశ్వర్లు,పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు,సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 2న సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు




**తుగ్గలి** సూపర్ సిక్స్ పథకాల అమలు కొరకు జూన్ 2న సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ధర్మాలను నిర్వహిస్తున్నట్లు సిపిఎం పార్టీ నాయకులు తెలియజేశారు.మండల కేంద్రమైన తుగ్గలిలో అర్హులైన ప్రజలందరికీ గ్రామాలలో మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెట్లు స్థలం పేద ప్రజలకు ఇవ్వాలని, ఇంటి నిర్మాణాలకు ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వం ఇవ్వాలని,సూపర్ సిక్స్ పథకాలు అమలుచేయాలని జరిగే ధర్నా పోస్టర్లను వారు విడుదల చేశారు. జూన్ రెండున రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాకు పెద్ద సంఖ్యలో ప్రజలందరూ పాల్గొనాలని, సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగే ధర్నా జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం నబి రసూల్,సిపిఐ కార్యదర్శి సుల్తాన్,కడమకుంట్ల గ్రామ సర్పంచ్ మస్తాన్ బి,కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి వి.నాగరాజు, మండల కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, సిపిఐ మాబు పీరా తదితరులు పాల్గొన్నారు.

## అధ్వానంగా తయారైన శిరగం రోడ్డు

- మరమ్మతులు చేపట్టండి గిరిజనుల ఆవేదన
- వాహనదారులకు పాదచారులు తీవ్ర అవస్థలు



**అరకులోయ** అరకులోయ మండలం మారుమూల ప్రాంతమైన శిరగం పంచాయతీ కేంద్రానికి వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిని అధ్వానంగా తయారవ్వడంతో వాహనదారులు అనేక అగచాట్లు పడుతున్నారు.ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి.కంకర రాళ్లు తేలి గుంతలు ఏర్పడటంతో ఈ రోడ్డు విస్మయానికి గురిచేస్తోంది.దీంతో పంచాయతీ వాసులు , వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు.రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజా ప్రతినిధులు , సంబంధిత అధికారులు వద్ద పలుమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని పంచాయతీ ప్రజలు ఆరోపిస్తున్నారు.కోడిపుంజు వలస గ్రామం నుంచి మొదలుకొని శిరగం పంచాయతీకి వెళ్లే రోడ్డు అభివృద్ధి పట్ల తీవ్రమైన నిర్లక్ష్యం ప్రదర్శింపబడుతుంది.గత ఎనిమిదేళ్లు గా ఈ రోడ్డు మరమ్మత్తులకు నోచుకోక ఇదే పరిస్థితి కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం పరుస్తున్నారు.ప్రభుత్వాలు పాలకులు , అధికారులు మారుతున్న రోడ్డు దుస్థితి మాత్రం మారడం లేదని వాపోతున్నారు.కంకర రాళ్లు తేలి గుంతలు పడిన రోడ్డు పై నిత్యం రాకపోకలు సాగిస్తున్నామని కొన్ని సమయం లో ప్రమాదాలు సంభవించి హాస్పటల్ పాలౌతున్నామని ఆందోళన చెందుతున్నారు.అలాగే వాహనాలు సైతం మెకానిక్ షెడ్లకు పరిమితమౌతున్నాయని గగ్గోలు పెడుతున్నారు.అనారోగ్యం పడిన వ్యాధిగ్రస్తులు , గర్భిణులు భాధలు వర్ణనాతీతం వారి కోసం అంబులెన్స్ వాహనాలకు ఫోన్ చేసిన రోడ్డు బాగులేని కారణంగా సకాలంలో రాలేని పరిస్థితి.ట్రాక్టర్లు , ఇతర వాహనాలపై వ్యవసాయ ఉత్పత్తుల్ని తీసుకొని వెళ్లలేక పోతున్నా మంటూ విచారం వ్యక్తం చేస్తున్నారు.రోడ్డు వేసి సుమారు 17 ఏళ్లు కావస్తోందని ఇప్పటికి కనీసం ఒక్కసారైనా రోడ్డు మరమ్మతు చేపట్టలేదని అంటున్నారు.కూటమి ప్రభుత్వం ప్రతి గ్రామంలో ను గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేపట్టి రూపు రేఖలు మారుస్తామని రాష్ట్ర రవాణా శాఖ చెప్తుంటే గిరిజన ప్రాంతంలో గుంతలు పడిన రోడ్ల దుస్థితి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విషయం తెలిసిందే ఇక్కడ అధికారులు ప్రజా ప్రతినిధులు చలనం లేని పరిస్థితి స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పంచాయతీ వాసులు , వాహనదారులు కోరుతున్నారు.

## సీఎస్సార్ కోసం 150 కోట్లు

- మలబార్ గ్రూప్ ప్రకటన

**హైదరాబాద్** సామాజిక సేవా కార్యక్రమాల కోసం ఈ ఆర్థిక సంవత్సరం 150 కోట్లు కేటాయించినట్లు మలబార్ గ్రూప్ ప్రకటించింది . హైదరాబాద్ పంజాగుట్ట మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూం వద్ద వరల్డ్ హంగర్ డేను పురస్కరించుకుని 2025-26 సంవత్సరంలో రెండున్నర కోట్ల మందికి భోజనాలు ఉచితంగా అందించాలని నిర్ణయించింది. గత మూడేళ్ళలో రెండున్న కోట్ల మందికి భోజనాలు అందించామని ...ఈ సీఎస్ఆర్ బడ్జెట్ లో 60 శాతం నిధులను నిరూపేదల ఆకలితీర్చేందుకు ,పేదరిక నిర్మూలన కోసం కేటాయించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు .

## పశువుల అక్రమ రవాణా ను నియంత్రించేందుకు అంతర్ జిల్లా చెక్ పోస్ట్ లు ఏర్పాటు



**జగిత్యాల :** పశువుల అక్రమ రవాణాను నిరోధించడానికి జిల్లాలో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్ట లను ఏర్పాటు చేసి నిరంతరగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ అన్నారు.ఈ చెక్‌పోస్టులలో 24 గంటలూ నిరంతర నిఘాలో ఉంటాయనీ, పోలీసు శాఖ మరియు పశుసంవర్ధక శాఖ సిబ్బంది షిఫ్టుల వారీగా సమన్వయంతో పనిచేస్తారని ఎస్పీ గారు వివరించారు. పశు వుల రవాణా అనేది నియమ నిబంధనల ప్రకారమే జరగాలని, అనుమతి పత్రాలు లేకుండా ఆవులు, దూడలను రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు.పశువులను రవాణా చేసే ప్రతి వాహనంతో చెల్లుబాటు అయ్యే పత్రాలు తప్పనిసరిగా ఉండాలనీ, ఎవ్వరు తమ ఆధారాలు లేకుండా రవాణాలో పాల్గొనరాదని ఎస్పీ సూచించారు. ఏ వ్యక్తి లేదా సంస్థ స్వయంగా వాహనాలను ఆపకూడదనీ, ఈ విషయంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అనుమానాస్పద రవాణా గమనించిన పక్షంలో వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలనీ ఎస్పీ సూచించారు. అదేవిధంగా సోషల్ మీడియాలో ద్వేషపూరిత, రెచ్చగొట్టే మరియు అసభ్యకరమైన పోస్టులు పెడితే, వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి మీడియా మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసినట్టు ఎస్పీ పేర్కొన్నారు.

## ‘అదృశ్య శత్రువులు’

ఉంది. వీటిలో కొన్ని భారీ గ్రహశకలాలు (ఆస్టరాయిడ్లు) భూమిని ఢీకొంటే, పెద్ద నగరాలు సైతం ధ్వంసమయ్యేంత వినాశనం సంభవించవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భూమికి అత్యంత సమీపానికి వచ్చిన తర్వాతే వీటిని గుర్తించే అవకాశం ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.శాస్త్రవేత్తలు ముఖ్యంగా 2020 ఎస్‌బి, 524522 వంటి గ్రహశకలాలను అత్యంత ప్రమాదకరమైనవిగా గుర్తించారు. ఇవి పరిమాణంలో వందల మీటర్ల వ్యాసం కలిగి, భూమికి సమీపంగా వస్తున్నాయి. శుక్రగ్రహం సృష్టించే ‘బ్లైండ్ స్పాట్’ (దృష్టికి అందని ప్రాంతం) వల్ల, ఈ అంతరిక్ష శిలలను ముందే పసిగట్టడం భూ-ఆధారిత టెలిస్కోపులకు సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో, శుక్రుడి కక్ష్యా ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించి, అక్కడ దాగివున్న గ్రహశకలాలను కనుగొనడానికి ప్రత్యేక అంతరిక్ష యాత్రలు చేపట్టాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ముందస్తు గుర్తింపు వ్యవస్థలను మెరుగుపరచడం ద్వారానే, సంభావ్య ప్రమాదాల నుంచి భూమిని కాపాడుకోవడానికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు సమయం లభిస్తుందని వారు నొక్కి చెబుతున్నారు.

## పాక్ వెన్నులో వణుకు పుట్టించేలా - సరిహద్దుల్లో మాక్ డ్రిల్స్

కుటుంబాన్ని ఎలా రక్షించుకోవాలి.? గాయపడ్డ వారిని ఆసుపత్రులకు ఎలా తరలించాలి.? వారికి అవసరమైన రవాణా ఎలా అందుబాటులో ఉంచాలి.? అనే అంశాలపై ఆ మాక్ డ్రిల్ సాగుతుంది. వైమానిక దాడి హెచ్చరిక వ్యవస్థల ప్రభావాన్ని అంచనా వేయడం, వైమానిక దళంతో హాట్‌లైన్/రేడియో కమ్యూనికేషన్ లింక్‌ల నిర్వహణ, కంట్రోల్ రూమ్స్, షాడో కంట్రోల్ రూమ్‌లతో అనుసంధానం కావడం, దాడి జరిగినప్పుడు తమను తాము రక్షించుకోవడం, క్రాష్ బ్లాక్ అవుట్‌లో ఎలా వ్యవహరించాలి, అగ్నిమాపక- రెస్క్యూ ఆపరేషన్లల్లో ఎలా పాల్గొనాలి వంటివి ఇందులో నేర్పిస్తారు. పాకిస్తాన్ తో యుద్ధ సమయంలో దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 244 జిల్లాల్లో ఈ సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ ను నిర్వహించింది కేంద్ర ప్రభుత్వం. సివిల్ డిఫెన్స్ వార్డెన్లు, హోమ్ గార్డులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాండిడేట్లు, వలంటీర్లు, నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ సభ్యులు, వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులను ఇందులో భాగస్వామ్యులయ్యారు. ఇప్పుడు తాజాగా అలాంటి మాక్ డ్రిల్స్ ను ఏకంగా పాకిస్తాన్ సరిహద్దుల్లో నిర్వహించబోతోండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. బ్లాక్ అవుట్స్ సైతం చేపడతామని కేంద్రం వెల్లడించింది. సరిహద్దు గ్రామాల ప్రజలకు ముందుగానే దీనిపై సమాచారం ఇస్తామని, వారిని అప్రమత్తం చేస్తామని పేర్కొంది.

## యుద్ధం ఆపడానికి ఉక్రెయిన్‌కు కండిషన్లు

పుతిన్ షరతులు విధించినట్లు రాయిటర్స్ తెలిపింది. మరోవైపు, శాంతి చర్చల ప్రతిపాదనలు వస్తున్నప్పటికీ రష్యా దాడులు కొనసాగిస్తూనే ఉంది. ఉక్రెయిన్‌లోని సుమీ ప్రాంతంలో నాలుగు సరిహద్దు గ్రామాలను రష్యా సైన్యం స్వాధీనం చేసుకుంది. ఈ నేపథ్యంలో, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కీలక ప్రతిపాదన చేశారు. పుతిన్‌తో ద్వైపాక్షిక చర్చలకు అంగీకారం కుదరకపోతే, అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కలిసి త్రైపాక్షిక చర్చలకు తాను సిద్ధమని ఆయన ప్రకటించారు. అదే సమయంలో, శాంతి ఒప్పందానికి ముందుకురాని రష్యాపై అమెరికా మరిన్ని కఠిన ఆంక్షలు విధించాలని జెలెన్‌స్కీ డిమాండ్ చేశారు.

## చదువుతోనే ఉన్నత శిఖరాలు సాధ్యం

ఆయన విమర్శించారు. “మాజీ ముఖ్యమంత్రి తన ఇంట్లో ఉద్యోగాలు ఇచ్చుకున్నారు గానీ, రాష్ట్రంలోని పేదలకు మాత్రం ఉద్యోగాలు ఇవ్వలేదు. తన ఇంట్లో వాళ్లు ఒక చోట ఓడిపోతే మరోచోట పదవులు ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చుకున్నారు” అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. అయినప్పటికీ, ఇంకా లక్షలాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయకుండా కొందరు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. “నోటికాడికి వచ్చిన ముద్ద లాక్కున్నట్టుగా కేసులు వేస్తున్నారు. ఆరు నెలలు కూడా విరామం లేకుండా వాళ్ల ఉద్యోగాలు భర్తీ చేసుకుంటున్నారు. విద్యార్థులకు మాత్రం సంవత్సరాల తరబడి ఉద్యోగాలు దక్కకుండా చేస్తున్నారు” అని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా అడ్డుకుంటున్న వారిని ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ నేతలతో ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి భేటీ

మీనాక్షి నటరాజన్ వివిధ లోక్‌సభ నియోజకవర్గాల నేతలతో సమావేశమయ్యారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్, జహీరాబాద్, మెదక్, మల్కాజ్‌గిరి స్థానాలపై దృష్టి సారించారు. ఈ సమావేశాలలో ఆయా నియోజకవర్గాల పరిధిలోని తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యకర్తల అభిప్రాయాలు, భవిష్యత్ కార్యాచరణపై నేతల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలోని కాంగ్రెస్‌ఎమ్మెల్యేలతో పాటు, గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో కూడా మీనాక్షి నటరాజన్ విడివిడిగా సమావేశమై చర్చించనున్నారు. ఈ విస్తృత స్థాయి సమీక్షల ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిని అంచనా వేసి, తదుపరి చర్యలకు రూపకల్పన చేయనున్నట్లు తెలుస్తోంది.

## చిన్నారులపై అఘాయిత్యాలు ఇంకా ఎంతకాలం?

ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులపై అఘాయిత్యాలు ఇంకా ఎంతకాలం? యావత్ సమాజం తలదించుకునే ఆకృత్యానికి పాల్పడిన అటువంటి నరరూప మృగాళ్ళను కఠినంగా శిక్షించాలి అని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఘటన వివరాలను అధికారుల ద్వారా తెలుసుకున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. “గతంలో కథువాలో ఆసిఫా అనే చిన్నారిపై జరిగిన దారుణమైన అఘాయిత్యం, హత్య ఘటన నన్ను తీవ్రంగా కలచివేసింది. అప్పుడు కూడా రోడ్డుపైకి వచ్చి పోరాటం చేశాను. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని బలంగా కోరుకున్నాను. అయినా మళ్లీ ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయంటే, నిందితుల్లో చట్టం నుంచి తప్పించుకోవచ్చనే ధీమా కారణం కావొచ్చు” అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ దారుణానికి పాల్పడిన కిరాతకుడిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేసి, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నారని పవన్ కల్యాణ్ వెల్లడించారు. నిందితుడికి అత్యంత కఠినంగా శిక్ష పడేలా చూడాలని, భవిష్యత్తులో ఇలాంటి పైశాచిక చర్యలకు పాల్పడాలంటేనే భయం పుట్టేలా చర్యలు తీసుకోవాలని న్యాయశాఖ, పోలీస్ శాఖ ఉన్నతాధికారులను, డీజీపీని, హోంశాఖ మంత్రి అనిత గారిని ఆయన కోరారు. చిన్నారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన పవన్ కల్యాణ్, నిందితులకు కఠిన శిక్ష పడేలా కూటమి ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని హామీ ఇచ్చారు. చిన్నారులపై జరుగుతున్న ఇలాంటి అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేయడానికి సమాజం మొత్తం మేల్కోవాల్సిన అవసరం ఉందని, దోషులకు కఠిన శిక్షలు విధించడం ద్వారానే భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలను నివారించగలమని ఆయన అభిప్రాయపడ్డారు.

## కాళేశ్వరం పుష్కరాలకు భారీ ఆదాయం

అనంతరం ఆలయ అధికారులు హుండీలను లెక్కించగా, భారీగా ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు.పుష్కరాలు ప్రారంభమైన మే 15వ తేదీ నుంచి ప్రతీరోజూ వేలాది మంది భక్తులు కాళేశ్వరానికి పోటెత్తారు. తొలి మూడు రోజులు వేలల్లో ఉన్న భక్తుల సంఖ్య, ఆ తర్వాత రోజుకు లక్షకు పైగా పెరిగింది. దీంతో త్రివేణి సంగమ ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ పీఠాధిపతులు, స్వాములు ఈ పుష్కరాల్లో పాల్గొని పుణ్యస్నానాలు చేశారు. ప్రత్యేక పూజలు, హోమాలతో కాళేశ్వర క్షేత్రం 12 రోజుల పాటు ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. పుష్కరాలు ముగిసిన తర్వాత సరస్వతి ఆలయంలోని పుష్కర హుండీలను, ఇతర హుండీలను ఆలయ సిబ్బంది లెక్కించారు. వరంగల్ సహాయ కమిషనర్ ఆర్. సునీత, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్. మహేశ్ పర్యవేక్షణలో ఈ లెక్కింపు జరిగింది. హుండీల పర్యవేక్షణాధికారి నందనం కవిత వెల్లడించిన వివరాల ప్రకారం, కాళేశ్వరం ఆలయానికి సరస్వతి పుష్కరాల 12 రోజులతో పాటు, మొత్తం 64 రోజుల కాలానికి హుండీల ద్వారా రూ.1,36,28,099 ఆదాయం వచ్చింది.

దీనితో పాటు, పుష్కరాల సందర్భంగా గదుల కేటాయింపు ద్వారా రూ.1,71,000, హోమాల ద్వారా రూ.1,23,000, శీఘ్రదర్శనం టికెట్ల ద్వారా రూ.5,60,000, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,38,36,552 ఆదాయం లభించింది. వీటన్నింటినీ కలిపి, మొత్తం 12 రోజుల పుష్కరాల ద్వారా ఆలయానికి రూ.2,83,18,651 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. నగదుతో పాటు, భక్తులు కానుకగా సమర్పించిన 15 గ్రాముల మిశ్రమ బంగారం, 1 కిలో 750 గ్రాముల మిశ్రమ వెండి కూడా హుండీల ద్వారా లభించినట్లు నందనం కవిత వివరించారు. ఈ పుష్కరాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీజీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది. ఈ 12 రోజుల వ్యవధిలో ఆర్టీసీకి కూడా సుమారు రూ.8 కోట్ల ఆదాయం లభించడం విశేషం.

## మణిపూర్‌లో వరుసగా మూడు భూకంపాలు

2:26 గంటలకు నోనెయ్ జిల్లాలో రెండోసారి భూమి కంపించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 2.5గా నమోదైంది. అనంతరం, ఉదయం 10:23 గంటలకు చురాచాంద్‌పూర్ జిల్లాలో మరోసారి భూమి కంపించింది. ఈసారి భూకంప తీవ్రత 3.9గా నమోదైందని జాతీయ భూకంప అధ్యయన కేంద్రం పేర్కొంది. వరుస భూ ప్రకంపనల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమీక్షించారు. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం, ఈ భూకంపాల వల్ల ఎక్కడా ఎలాంటి ప్రాణ నష్టం గానీ, ఆస్తులకు నష్టం వాటిల్లినట్లుగానీ నివేదికలు అందలేదని అధికారులు స్పష్టం చేశారు. దీంతో స్థానిక ప్రజలు, అధికార యంత్రాంగం ఊరట చెందారు.

## ఉచిత చేప పిల్లల పంపిణి టెండర్లపై మాత్స్య శాఖ మొద్దు నిద్ర - కంతి హరికుమార్

**మెట్ పల్లి** ఉచిత చేప పిల్లల పంపిణీ టెండర్లపై మత్స్యశాఖ మొద్దు నిద్ర వీడడం లేదని టీపీసీసీ ఫిషరీస్ కార్య నిర్వాహక సభ్యుడు కంతి హరికుమార్ ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన మెట్ పల్లి లోని స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, నైరుతి రుతుపవనాలు ముంచుకొస్తున్నా, ఉచిత చేప పిల్లల పంపిణీ పై మత్స్యశాఖ మేల్కొనడం లేదని ధ్వజమెత్తారు. ఆనవాయితీగా ప్రతి ఏడాది జూన్ నుంచి ఆగస్టు మధ్యలో చెరువుల్లో చేప పిల్లలను వదలాల్సి ఉండగా, గత దశాబ్ద కాలంగా ఈ ప్రక్రియ నత్త నడకన సాగుతుందన్నారు. మత్స్యకారుల లబ్ధి కోసం నూరు శాతం సబ్సిడీతో 2016 లో ఉచిత చేప పిల్లల పంపిణీకి అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టినా ఏ ఒక్క ఏడాది కూడా చెరువుల్లోకి చేప పిల్లలు సకాలంలో చేరిన దాఖలాలు లేవని అన్నారు. కాంట్రాక్టర్ల కొరత అధికారుల సమన్వయ లేమితో ఈ పథకం ఆబాసు పాలవుతుందని ధ్వజమెత్తారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది అయినా ముందస్తుగా టెండర్లు పూర్తి చేస్తారనుకుంటే ఆ దిశలో ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంపై జిల్లావ్యాప్తంగా మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. మే నెల గడుస్తున్నా టెండర్ల కసరత్తుకు మత్స్యశాఖ సిద్ధం కాకపోవడంలో ఉన్న ఆంతర్యం ఏమిటో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో జూన్ మొదటి వారంలో భారీగా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ స్పష్టంగా ప్రకటించిందని, ఇప్పటికి ఆ దిశగా మత్స్యశాఖ చేప పిల్లల పంపిణీ ప్రక్రియకు సంబంధించి ఎలాంటి కసరత్తు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. మే నెలలో టెండర్ల ప్రక్రియ ప్రారంభించి జూన్ నెలలో ఖరారు చేస్తే.. రెండో వారం నుండి చెరువుల్లో చేప పిల్లలు పంపిణీ చేయడానికి వీలుంటుండేదని అన్నారు. ప్రతి ఏడాది ఆలస్యంగా టెండర్లు పిలవడం అధికారులకు అలవాటుగా మారిందని, సమయం దాటాక చేప పిల్లలను పంపిణీ చేయడంలో గంగపుత్రులకు ఎలాంటి ప్రయోజనం లేదని తెలిపారు. గత ప్రభుత్వ హాయంలో ఉచిత చేప పిల్లలను పంపిణీ చేయడంతో ఎలాంటి లబ్ధి చేకూరక గంగ పుత్రులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు.

కాంట్రాక్టర్ల వైఖరి అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఈ పథకం ఆభాసు పాలవుతోందని, దీని మూలంగా లక్షల మంది మత్స్యకారుల కుటుంబాలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. గత టెండర్ల ప్రక్రియ లో జరుగుతున్న లోపాలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా అధికారులు వేగం పెంచి నిధుల కొరత ఉంటే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి నిధులు సమకూర్చుకోవాలని ఇందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని తెలిపారు.

## కేశనపల్లి ఉచిత వైద్య శిబిరానికి బారి స్పందన



**మంథని** ముత్తారం మండలంలోని కేశనపల్లి గ్రామంలో రాష్ట్ర ఐటీ,పరిశ్రమలు,శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు కరీంనగర్ లోని సన్ రైస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు,ముత్తారం మండల మాజీ జెడ్పిటిసి చొప్పరి సదానందం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ క్యాంపులో కేశనపల్లి గ్రామస్తులు 500కు పైగా పాల్గొని ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోగా భారీ స్పందన లభించింది.ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బక్కతట్ల వినీత్,గ్రామ శాఖ అధ్యక్షులు పెగడ కుమార్,గ్రామ యూత్ అధ్యక్షులు నవీన్,సన్ రైస్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రక్షిత,క్యాంప్ మేనేజర్ రాజేందర్,కోఆర్డినేటర్ సతీష్,మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ తిరుపతి మరియు సన్రైజ్ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు

## థియేటర్లను తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్

**విజయనగరం** నగరంలోని పలు థియేటర్లలో జాయింట్ కలెక్టర్ ఎస్ సేతు మాధవన్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. ముందుగా లీలా మహల్ థియేటర్ లో తనిఖీలు చేసారు. పారిశుద్ధ్య నిర్వహణ, తిను బండారాల నాణ్యత, వాటి ధరలు, టికెట్ ధరలు, విక్రయాలు, ఫైర్ సేఫ్టీ, మరుగుదొడ్ల నిర్వహణ వంటి అంశాలపై జాయింట్ కలెక్టర్ ఎస్ సేతు మాధవన్ ఆరా తీసారు.ఈ కార్యక్రమంలో ఇన్ చార్జి ఆర్.డి.ఓ సవరమ్మ, ఇన్ చార్జి తహసీల్దార్ స్వర్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మండలానికి 580 క్వింటాళ్ల వేరుశనగ కేటాయింపు...

**- మండల వ్యవసాయ అధికారి రవి**

**మద్దికేర** మద్దికేర మండలానికి 580 క్వింటాళ్ల వేరుశనగను కేటాయించినట్లు మద్దికేర మండల వ్యవసాయ అధికారి రవి తెలియజేశారు.విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేరుశనగ విత్తనాలు కావలసిన రైతులు తమ పరిధిలోని గల స్థానిక రైతు సేవా కేంద్రం నందు వ్యవసాయ అధికారులను సంప్రదించి రసీదు పొందాలని ఆయన తెలియజేశారు.క్వింటం వేరుశనగ ధర 9300 కాగా,40 శాతం సబ్సిడీతో 3720 రూ పోగా రైతులు 5580 రూపాయలు చెల్లించాలని ఆయన తెలియజేశారు.

రైతుకు గరిష్టంగా 90 కేజీల విత్తనాలను మాత్రమే అందజేస్తామని ఏవో రవి రైతులకు తెలియజేశారు.మరింత సమాచారం కొరకు తమ పరిధిలోని గల రైతు సేవ కేంద్రాన్ని సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి రవి తెలియజేశారు.

## చివరి వరకు అవినీతి మచ్చలేని నాయకునిగా సేవలందించిన జువ్వాడి



**కరీంనగర్** మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ మంత్రి జువ్వాడి చొక్కారావు వర్ధంతి సందర్భంగా నేడు కరీంనగర్ డిసిసి కార్యాలయంతో పాటు నగరంలోని వన్ టౌన్ చౌరస్తా వద్ద గల చొక్కా రావు విగ్రహం వద్ద కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడం జరిగింది. మొదట కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీనియర్ కాంగ్రెస్ నాయకులు అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాసి రెడ్డి పాటు పలువురు నాయకులు హాజరై జువ్వాడి చొక్కా రావు చిత్రపటానికి పూలమాలు ఘన నివాళులు అర్పించారు. అనంతరం నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో చొక్కా రావు విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమానికి నగర కాంగ్రెస్ అధ్యక్షులు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు కర్ర రాజశేఖర్, ముల్కల ప్రవీణ్ తో పాటు పలువురు నాయకులు హాజరై చొక్కా రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి మాట్లాడుతూ.. నీతికి, నిజాయితీకి నిలువుటద్దంలా, తెలంగాణ తొలి దశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించడంతోపాటు తెలంగాణ ప్రాంత అభివృద్ధి కమిటీ చైర్మన్ గా మూడుసార్లు ఎంపీగా, నాటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వంలో పలు కీలక మంత్రి పదవులు చేపట్టి అటు ప్రజలకు ఇటు కాంగ్రెస్ పార్టీకి సేవలు అందించిన జువ్వాడి చొక్కా రావు వారి జీవితంలో అవినీతి మచ్చ లేకుండా సుపరిపాలన చేసి రాజకీయాలకు వన్నెతెచ్చిన గొప్ప నాయకుడిగా గొప్ప పేరు సంపాదించుకున్నారు. వారు చూపిన బాటలో నడవడం, వారి ఆశయాల సాధన కోసం, వారు కన్న కలలను సాకారం చేయడం కోసం జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నాయకులమైన మేమంతా అంకితభావంతో పనిచేస్తామని, చివరి వరకు విలువలతో కూడిన రాజకీయం చేసిన ఆ మహనీయున్ని కరీంనగర్ ప్రజలు ఎన్నటికీ మరువలేరని అన్నారు. ఈ కార్యక్రమాలలో నాయకులు సుంకరి గణపతి, వంగల విద్యాసాగర్, ఎలగందుల మల్లేశం, నెల్లి నరేష్, నాగుల సతీష్, వెన్నం రజిత రెడ్డి, గంగుల దిలీప్, మాదాసు శ్రీనివాస్, కుర్ర పోచయ్య, పడిశెట్టి భూమయ్య, మహేష్, శ్రీరాముల రమేష్, తోట అంజయ్య, పర్వత మల్లేశం, రాచర్ల పద్మ, అనరసు కుమార్, మూల జైపాల్, చింతల కిషన్, కన్నం అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమలో మోసపోయి ఆత్మహత్య చేసుకున్న యువకుడు



**వికారాబాద్** వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండలం చిట్టిగిద్ద గ్రామానికి చెందిన సందీప్ (23) ప్రేమించిన అమ్మాయి మోసం చేసిందని ఆత్మహత్య చేసుకున్నాడు.మూడు సంవత్సరాలుగా ప్రేమించిన అమ్మాయి నువ్వు నాకు వద్దు చనిపో అని చెప్పడంతో మనస్తాపానికి గురై నిన్న సాయంత్రం పోలంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.అమ్మాయి టార్చర్ భరించలేకనే నా కొడుకు చనిపోయాడని కన్నీళ్లు పెట్టుకున్నారు మృతుని తల్లి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు నవాబుపేట పోలీసులు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఏసీబీ వలలో ముషీరాబాద్ ఆర్ఐ

**హైదరాబాద్** ముషీరాబాద్ ఎమ్మార్వో కార్యాలయంలో ఏసీబీ సోదాలు జరిపింది. ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం లంచం డిమాండ్ చేసిన ఆర్ఐ మహేశ్, 1 లక్ష 30 వేలు లంచం డిమాండ్ చేసినట్లు గుర్తించింది. 25 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఎమ్మార్వో కార్యాలయంలో తోపాటు మహేశ్ నివాసంలో సోదాలు చేస్తున్నారు. ఆర్ఐ మహేశ్ ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

## ఆదర్శ పాఠశాలగా రుద్రారం జడ్పీ ఉన్నత పాఠశాల

**సంగారెడ్డి** పటాన్ చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను 16 కోట్ల రూపాయల సి.ఎస్.ఆర్ నిధులతో ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దబోతున్నట్లు పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పాఠశాల నిర్మాణ ప్లాన్, మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాట్లాడుతూ రుద్రారం గ్రామ పరిధి నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి పాఠశాల భవనాలను ఆధునిక సాంకేతికతో నిర్మించబోతున్నట్లు తెలిపారు. ఓజఐ లాటిక్రేట్ పరిశ్రమ సహకారంతో 16 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రముఖ ఆర్కిటెక్చర్ సంస్థ కృతిక ద్వారా ఆధునిక వసతులతో నిర్మించనున్నట్లు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మూడు ఎకరాల 34 గంటల స్థలంలో 43,378 చదరపు అడుగుల విస్తీర్ణంతో 15 తరగతి గదులు, మండల పరిషత్ పాఠశాలను ఒక ఎకరా 23 గుంటల స్థలంలో 26,586 చదరపు అడుగుల విస్తీర్ణంలో 10 తరగతి గదులు నిర్మించబోతున్నట్లు తెలిపారు. వీటితోపాటు ఫుట్ బాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ కోర్టులను నిర్మించబోతున్నట్లు తెలిపారు. గ్రామంలోని ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించేలా పాఠశాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని తల్లిదండ్రులు పాఠశాల బృందానికి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. త్వరితగతిన పాఠశాల నిర్మాణం పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని వస్తామని తెలిపారు.

## కుక్కల దాడిలో 37 గొర్రెలు మృతి 15 గొర్రెలకు గాయాలు

**మహేశ్వరం** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల పరిధిలోని దయ్యాల గుండు తండాలో రమావత్ డాక్యా కి చెందిన గొర్రెల మందల పై కుక్కలు మూకుమ్మడిగా దాడి చేయడంతో 37 గొర్రెలు మృతి 15 గొర్రెలు గాయాలు అయ్యాయి. గొర్రెల మందపై కుక్కలు మూకుమ్మడిగా దాడి చేయడంతో ఐదు లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని యజమాని బోరున విలపిస్తున్నాడు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని గొర్రెల యజమాని రమావత్ డాక్యా ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాడు. వెటర్నటీ అసిస్టెంట్ డైరెక్టర్ లలిత గొర్రెల మృతి జరిగిన నష్టం పై ప్రభుత్వానికి నివేదికను అందజేయడం జరుగుతుందని తెలిపారు.

## శేరిలింగంపల్లిలో ఎన్టీఆర్ జయంతి

**రంగారెడ్డి** మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పి ఎస్ సి చైర్మన్ అరికెపూడి గాంధీ వివేకానంద నగర్ లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆనాటికి ఈనాటికి ఎన్టీఆర్ అంటే ప్రతి ఒక్కరికి గర్వకారణం అని కొనియాడారు ఆడపిల్లలకు సమాన హక్కులు కల్పించడంలో కీలకంగా వ్యవహరించాలని గుర్తు చేశారు. రెండు రూపాయలకే కిలో బియ్యం అందిస్తూ సామాన్య గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని వ్యాఖ్యానించారు చిత్రరంగంలో దేవుడు ఎలా ఉంటాడో ఎన్టీఆర్ రూపంలో కనిపించారని ఆయన చెప్పుకొచ్చారు ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎన్టీఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనాలను అరికట్టి ప్రతిష్టమైన చర్యలు చేపట్టాలి

**- అసాంఘిక కార్యకలాపాలపై పోలీసు ఉక్కుపాదం మోపాలి**

**- ఎస్ పి రోహిత్ రాజ్ కు వినతిపత్రం అందజేసిన సామాజిక సేవకులు కర్నే బాబురావు**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా** మణుగూరులో వరుస దొంగతనాలతో కార్మికులు,ప్రజలు హడలెత్తిపోతున్నారని వెంటనే పోలీస్ శాఖ సమర్థత చర్యలు చేపట్టాలని, అలాగే అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపాలని ప్రజలకు, కార్మికులకు, కార్మిక వార్డులకు భరోసా కల్పించాలని కోరుతూ, సామాజిక కార్యకర్త బుధవారం జిల్లా ఎస్ పి రోహిత్ రాజ్ కి వినతిపత్రం అందజేసినట్లు కర్నే బాబురావు విలేకరులకు తెలిపారు. పివి కాలనీలో సుమారు ఏడు క్వార్టర్లలో దొంగలు హల్ చల్ చేశారనీ,బంగారం వెండి ఆభరణాలతో పాటు నగదు లక్ష్యంగా దొంగలు చోరీలకు పాల్పడ్డారని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని,ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుని పోలీసు శాఖ చోరీ జరిగిన క్వార్టర్లను క్లూస్ టీం తో సందర్శించి ఆధారాలను సేకరించడంతోపాటు బాధితులకు కూడా ధైర్యం చెప్పాలని కోరారు. అలాగే విలువైన వస్తువులు కోల్పోయిన కార్మికులకు న్యాయం చేయాలన్నారు.చోరీకి సొత్తు రికవరీచేసి బాధితులకు న్యాయం చేసే విధంగా యాజమాన్యం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా చూడాలనీ, సంతతో పాటు ఇతర ప్రధాన సెంటర్ లలో సీసీ కెమెరాలు విస్తృత పరిచి, పటిష్టమైన ఫెన్సింగ్ నిర్మించి,కార్మిక వాడలను సందర్శించే వారికీ సింగరేణి సెక్యూరిటీ డిపార్ట్మెంట్ నిఘా ఏర్పాటు చేయాలనీ, సింగరేణి సెక్యూరిటీ విభాగం సమన్వయంతో కాలనీలో పెట్రోలింగ్ నిర్వహించాలనీ , పివి కాలనీలోని పోలీస్ కంట్రోల్ రూమ్ పునరుద్ధరించాలనీ, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు చేపట్టాలని బాబురావు ఎస్పీకి వినతి చేశారు.

## ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో నిజమైన అర్హులకు అన్యాయం

**- మడిపల్లి గ్రామస్తులు..**



**జమ్మికుంట** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇల్లు పంపిణీలలో అర్హులైన నిరుపేదలకు కాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అనర్హులకు ఇదివరకు ఇల్లు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ ఇచ్చారని నిజమైన ఇల్లు లేని నిరుపేదలకు అన్యాయం జరిగిందని బుధవారం మడిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు రాని నిరుపేదలు ఏకమై రోడ్డుపై కూర్చొని నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో మడిపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ఇళ్ల కమిటీని ఏర్పాటు చేశారని ఇట్టి కమిటీలో కాంగ్రెస్ కార్యకర్తలకు వారి బంధువులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చేశారని బాధితులు గ్రామ కార్యదర్శిని వివరణ కోరగా కార్యదర్శి కూడా కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ఇళ్ల కమిటీని ఏర్పాటు చేశారని వారు ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రొసీడింగ్ లు వచ్చాయని చెప్పడం విడ్డూరంగా ఉందని బాధితులు అసహనం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న జమ్మికుంట ఎస్సై శేఖర్ రెడ్డి,సంఘటన స్థలానికి చేరుకొని రోడ్డుపై బైఠాయించిన వారికి నచ్చజెప్పి అధికారుల సమక్షంలో విచారణ చేయించి నిజమైన అర్హులకు న్యాయం కలిగేలా చేస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

## నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ హాస్పిటల్స్ గుర్తింపు రద్దు చేయాలి

**- రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్ డిమాండ్**

**మైదుకూరు** స్థానిక ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రైవేట్ హాస్పిటల్స్ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా హాస్పిటల్స్ కు వచ్చే పేషెంట్ దగ్గర నుంచి 300 నుండి 500 వరకు టోకెన్ ఫీజు వసూలు చేస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు, ఏ హాస్పిటల్స్ లో గాని పార్కింగ్ ప్లేస్ కానీ పేషెంట్స్ వెయిటింగ్ చేసేదానికి వెయిటింగ్ హాల్ కానీ వాష్రూమ్స్ కూడా కొన్ని హాస్పిటల్స్ లో లేకపోవడం చాలా బాధాకరం అమాయక ప్రజలను మోసం చేయడంలో ప్రొద్దుటూరులోని ప్రైవేట్ హాస్పిటల్ పూర్తిగా నిమగ్నమైనాయని వారు తెలియజేశారు, మరికొన్ని హాస్పిటల్స్ లో ఎవరైనా ఆపదలో ఉన్న మనిషిని లోపలికి తీసుకోవడానికి స్ట్రక్చర్ కూడా లేకపోవడం చాలా బాధాకరం అదేవిధంగా ఫైర్ సేఫ్టీ హాస్పిటల్స్ లో ఎటువంటి బిఎస్సి నర్సింగ్ జి ఎన్ ఎం వంటి అర్హత కలిగిన విద్యార్థులు ఏ ఒక్క ప్రైవేట్ హాస్పిటల్లో లేకపోవడం ప్రైవేట్ హాస్పిటల్స్ కు అవమానం అని వారు విమర్శించారు, క్వాలిఫైడ్ స్టాఫ్ ను పెట్టుకుంటే వారికి ఎక్కువ జీతాలు ఇవ్వాల్సిగా ఉంటుందని ఏమి చదవని ట్రైనింగ్ తీసుకున్న వారిని హాస్పిటల్స్ లో ఉంచుకొని తక్కువ జీతాలతో సరిపెడుతూ నిబంధనలు తుంగలో తొక్కుతూ లక్షల రూపాయలు వారి అకౌంట్లో జమ చేసుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు అదేవిధంగా సిటీ స్కానింగ్ సెంటర్లు ఈరోజు ఎటువంటి నోటీసు బోర్డులో ఫీజులు వివరాలు పెట్టకుండా వారి ఇష్టానుసారంగా 5000 నుండి 10000 రాబడుతూ ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు, కూలి నాలి చేసుకున్న ప్రజలు ఇంత అమౌంట్ కట్టవలసి వస్తే వారు ఏ విధంగా అమౌంట్ చెల్లిస్తారని వారు తెలియజేశారు, ప్రైవేట్ హాస్పిటల్స్ లో క్వాలిఫైడ్ స్టాఫ్ లేకుండా పార్కింగ్ ప్లేస్ లేకుండా ఫైర్ సేఫ్టీ లేకుండా కనీస స్ట్రక్చర్ లేకుండా అపార్ట్మెంట్లలో షాపింగ్ కాంప్లెక్స్ లలో ఇండ్లలో ఆర్ఎంపీ డాక్టర్లు కూడా ఎంబిబిఎస్ డాక్టర్ల మాదిరి వైద్యం నిర్వహిస్తున్న ప్రొద్దుటూర్ పట్టణంలోని హాస్పిటల్స్ పై జిల్లా డిఎంహెచ్ఓ గారు జిల్లా కలెక్టర్ గారు చర్యలు తీసుకొని ఇటువంటి అవినీతి అక్రమాల హాస్పిటల్ ను గుర్తింపు రద్దు చేయాలని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం.

## యాదాద్రిలో చింతపండు చోరీ యత్నం

**యాదాద్రి** తెలంగాణ ఆధ్యాత్మిక కేంద్రమైన యాదగిరిగుట్టపై చోరీ యత్నం కలకలం రేపింది! ఏకంగా ఆలయ ప్రసాద తయారీ కేంద్రం నుంచే చింతపండు బస్తాలను చోరీ చేయడానికి ప్రయత్నించారు! అందులోనూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులే ఈ చేతివాటం ప్రదర్శించడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కొండపైన ఉన్న ప్రసాద తయారీ కేంద్రం నుంచి కన్వేయర్ బెల్టు ద్వారా చింతపండు బస్తాలను బయటకు తెచ్చి, కారులో తరలించడానికి ప్రయత్నిస్తుండగా... పెట్రోలింగ్కు వచ్చిన పోలీసులు వారిని చూశారు. పోలీసులను చూడగానే సదరు ఉద్యోగులు కారు, చింతపండు బస్తాలను వదిలేసి పారిపోయారు. వెంటనే స్పందించిన పోలీసులు 10 చింతపండు బస్తాలను స్వాధీనం చేసుకున్నారు.ఘటన అనంతరం చోరీకి యత్నించిన ఇద్దరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పోలీసులు పట్టుకున్నారు. అయితే, ఈ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల చేతివాటం వెనుక ఆలయ ఉన్నతాధికారుల హస్తం కూడా ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయానికి భద్రత కల్పిస్తున్న ఎస్పీఎఫ్ (స్పెషల్ ప్రోటెక్షన్ ఫోర్స్ ) పోలీసుల నిర్లక్ష్యమే ఈ ఘటనకు కారణమంటూ భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## గర్భిణీలకు పౌష్టిక ఆహారం పంపిణీ.



**రామగుండం** గోదావరిఖని బాపూజీ నగర్ లోని , గర్భిణి లకు వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ లయన్ డాక్టర్ ,సురభి శ్రీధర్ జన్మదినం సందర్భంగా మంగళవారం సాయంత్రం పౌష్టిక ఆహారం సంబంధించిన వస్తువులను అమ్మ పరివార్ స్వచ్ఛ సేవ సంస్థ ఆధ్వర్యంలో డా. సురభి శ్రీధర్ అందించారు. అనంతరం సురభి శ్రీధర్ మాట్లాడారు. గర్భిణీలు పౌష్టిక ఆహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. గర్భిణీ తో ఉన్న ప్రతి మహిళ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అమ్మ పరివార్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. నిస్సహాయ పిల్లలకు ఆశ్రయం ఇవ్వడం కాకుండా ప్రతిరోజు నిస్సహాయులకు, నిర్భాగ్యులకు అన్న దాన కార్యక్రమం చేపడుతున్న సంస్థ బాధ్యులందరికీ వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ పక్షాన ధన్యవాదములు తెలుపుతున్నామని సురభి శ్రీధర్ తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో అమ్మ పరివార్ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారి సహస్ర అమ్మ పరివార్ సంస్థ నిర్వాహకులు మంద నాగరాజు, కరణ్, అంగన్వాడి టీచర్ రమా తదితరులు పాల్గొన్నారు.



## బాబోయ్ స్విమ్మింగ్ పూల్‌లో
# అనసూయ రచ్చ..

అందాల ముద్దుగుమ్మ అనసూయ నిత్యం వార్తలలో నిలుస్తుంటుంది. ఈ అమ్మడు ఏం చేసిన అది వార్తనే. ఈ మధ్య అనసూయ కొత్తింటి గృహప్రవేశం చేసింది. అత్యాధునిక సౌకర్యాలతో కూడిన విలాసవంతమైన ఇంటిలో అడుగుపెట్టింది. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఆ తర్వాత వెంటనే కుమారుడి ఉపనయనం వేడుక కూడా జరిపింది. అందుకు సంబంధించిన ఫొటోలని కూడా సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇక ఈ వేడుకలు పూర్తైన వెంటనే ఫ్యామిలీతో కలిసి శ్రీలంకలో వాలింది. సమ్మర్ వెకేషన్‌లో భాగంగా శ్రీలంకకి వెళ్లిన అనసూయ..అక్కడ తమ ఎంజాయ్‌మెంట్‌కి సంబంధించిన ప్రతి విషయాన్ని ఇన్‌స్టా ద్వారా షేర్ చేస్తుంది.తాజాగా అనసూయ తన సోషల్ మీడియాలో కొన్ని ఫొటోలను షేర్ చేసింది. ఫ్యామిలీతో కలిసి వెకేషన్‌కు వెళ్లిన ఫొటోలను తన సోషల్ మీడియాలో షేర్ చేసింది అనసూయ. ఈ క్రమంలో అనసూయ అభిమానులకు బికినీ ట్రీట్ ఇచ్చింది. తన ఇద్దరు కుమారులు, భర్తతో ఆహ్లాదంగా గడుపుతూ స్విమ్మింగ్ పూల్‌లో ఎంజాయ్ చేస్తున్న ఫొటోలు, వీడియోలు షేర్ చేసింది. గతంలో కూడా అనసూయ పలు సందర్భాలలో బికినీ ఫొటోలు షేర్ చేసి ఫ్యాన్స్ కి మాంచి కిక్ ఇచ్చింది. మరోవైపు స్విమ్మింగ్ పూల్ లో అనసూయ తన భర్తతో రొమాంటిక్ గా కనిపించింది. ఇక అనసూయ మరి కొద్ది రోజుల పాటు శ్రీలంకలోనే ఉండనుండగా, ఇంకెన్ని ట్రీట్స్ ఇస్తుందో అని ఫ్యాన్స్ ముచ్చటించుకుంటున్నారు. న్యూస్ రీడర్‌గా కెరీర్ మొదలు పెట్టిన అనసూయ..ఆ తర్వాత యాంకర్‌గా అలరించింది. ఇక నటిగాను అదరగొడుతుంది. ఈ బ్యూటీ. క్షణం, రంగస్థలం,కథనం, విమానం , పుష్ప, కిలాడి మొదలగు సూపర్ హిట్ సినిమాల్లో నటించి నటిగా తనకు ఎదురులేదనిపించింది. రంగస్థలం సినిమా తర్వాత అనసూయ వరుస సినిమాల్లో నటిస్తూ బిజీ ఆర్టిస్ట్‌గా మారిపోయింది.. హీరోయిన్లతో సమానంగా అనసూయ క్రేజ్ ఉందంటే.. ఆమె ప్రభావం ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక సోషల్ మీడియాలో చెక్కుచెదరని అభిమానాన్ని సొంతం చేసుకొని మిలియన్ల సంఖ్యలో ఫాలోవర్స్ సంపాదించుకుంటుంది ఈ ముద్దుగుమ్మ.

## ప్రాణాంతక లివర్ క్యాన్సర్ బారిన
# పడిన ప్రముఖ నటి..



ప్రముఖ టీవీ నటి దీపికా కాకర్ ప్రాణాంతక లివర్ క్యాన్సర్ బారిన పడ్డారు. ఈ విషయాన్ని ఆమే స్వయంగా సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. గత కొన్ని రోజులుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్న ఆమె ట్రీట్‌మెంట్ తీసుకున్నారు. అయినప్పటికీ నొప్పి తగ్గకపోగా పెరుగుతోంది. దీంతో స్కానింగ్ చేయించు కోగా క్యాన్సర్‌గా తేలింది. లివర్‌లో టెన్నిస్ బాల్ సైజులో టూమర్ ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఆ కణితి ప్రమాదకర దశలో ఉందని పేర్కొన్నారు. స్టేజ్ 2 దశలో ఉన్న క్యాన్సర్‌గా వైద్యులు నిర్ధరించారు. ఈ విషయాన్ని నటి ఇన్‌స్టా స్టోరీస్ ద్వారా అభిమానులతో షేర్ చేసుకున్నారు. 'గత కొన్ని వారాలుగా గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నాం. నా కడుపు పైభాగంలో విపరీతమైన నొప్పి కారణంగా ఆసుపత్రి చుట్టూ తిరగాల్సి వచ్చింది. వైద్య పరీక్షల్లో కాలేయంలో టెన్నిస్ బాల్ పరిమాణంలో కణితిని వైద్యులు గుర్తించారు. ఆ కణితి ప్రమాదకర దశలో ఉంది. స్టేజ్ 2 దశలో ఉన్న క్యాన్సర్‌గా వైద్యులు నిర్ధరించారు. ఈ ప్రాణాంతక లివర్ క్యాన్సర్‌ను ధైర్యంగా ఎదుర్కోవాలని నిర్ణయించుకున్నాను. దైవబలం, అభిమానుల ఆశీర్వాదాలు, ఆదరణతో ఈ ప్రమాదాన్ని విజయవంతంగా అధిగమిస్తాను' అని దీపికా కాకర్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. ఈ పోస్ట్ చూసిన నెటిజన్లు, అభిమానులు దీపిక కక్కర్ త్వరగా కోలుకోవాలంటూ కామెంట్స్ చేస్తున్నారు. కాగా గత నెల జమ్ము కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడి నుంచి దీపిక కాకర్ ఫ్యామిలీ తృటిలో తప్పించుకున్న విషయం తెలిసిందే. దీపికా కాకర్ తన భర్త షోయబ్ ఇబ్రహీం గత నెల జమ్ముకశ్మీర్‌కు వెళ్లారు. అక్కడ బైసరాన్ వ్యాలీని కూడా సందర్శించారు. ఈ సందర్శన అనంతరం వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. వారు తమ వెకేషన్‌ను ముగించుకున్న కొన్ని గంటల్లోనే అక్కడ ఉగ్రదాడి జరిగింది. ఈ విషయాన్ని దీపికా-షోయబ్ జంట సోషల్ మీడియా ద్వారా పంచుకున్న విషయం తెలిసిందే.

## స్వచ్ఛమైన అనుబంధాల్ని
# చూపించాం



'ప్రస్తుతం విలువలతో కూడిన సినిమాలు రావడం తగ్గిపోయింది. ఈ కథలోని కుటుంబ భావోద్వేగాలు కట్టిపడేశాయి. ఇందులోని ప్రతీ పాత్రకు ప్రేక్షకులు వ్యక్తిగతంగా కనెక్ట్ అవుతారు' అన్నారు రూపేశ్. స్వీయ నిర్మాణంలో ఆయన హీరోగా నటించిన 'షష్టిపూర్తి' చిత్రం ఈ నెల 30న విడుదలకానుంది. రాజేంద్రప్రసాద్, అర్చన ప్రధాన పాత్రల్లో నటించారు. పవన్‌ప్రభ దర్శకుడు. ఈ సందర్భంగా మంగళవారం హీరో, నిర్మాత రూపేశ్ కుమార్ విలేకరులతో మాట్లాడారు. సినిమాలో స్వచ్ఛమైన ప్రేమను, కుటుంబ అనుబంధాల ఔన్నత్యాన్ని చూపిస్తున్నామన్నారు.'ఈ సినిమాలో రాజేంద్రప్రసాద్ కొడుకుగా కొత్త నటుడైతే బాగుటుంది..ఎలాంటి అంచనాలు లేకుండా సినిమా చూస్తారని దర్శకుడు భావించారు. దాంతో నేను ఈ ప్రాజెక్ట్‌లోకి ఎంటరయ్యాను' అన్నారు. ఇళయరాజా, తోట తరణి వంటి లెజెండ్స్ ఈ సినిమా కోసం పనిచేశారని, ఇళయరాజా మ్యూజిక్ సినిమా స్థాయిని పెంచిందని తెలిపారు. 'కథాబలం ఉంది కాబట్టే పెద్ద టెక్నీషియన్స్ ఈ సినిమాలో భాగమయ్యారు. కీరవాణిగారు అడిగిన వెంటనే పాట రాసిచ్చారు. ఈ సినిమాలో అందమైన ప్రేమకథ కూడా ఉంటుంది. ఇలాంటి సెన్సిబుల్ స్టోరీ ఇటీవలకాలంలో రాలేదు. రెండు రాష్ట్రాల్లో భారీ



# టాటూలు వేయించుకోకండి..
## అభిమానులకు సమంత కీలక సలహా

టాలీవుడ్ అగ్రతార సమంత రూత్ ప్రభు టాటూల విషయంలో తన అభిమానులకు కీలకమైన సలహా ఇచ్చింది. మీరు ఎప్పటికీ, ఎప్పటికీ టాటూ వేయించుకోవద్దు అని ఆమె చెప్పుకోచ్చారు. కాగా ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. గతంలో సమంత తన శరీరంపై మూడు టాటూలు వేయించుకున్న విషయం తెలిసిందే. వీటిలో రెండు ఆమె మాజీ భర్త నాగ చైతన్యకు సంబంధించినవి కావడం గమనార్హం.ఆమె తొలి సినిమా 'ఏ మాయ చేశావే' పేరులోని మొదటి అక్షరాలు YMC ఆమె మెడ వెనుక భాగంలో ఉన్నాయి. Chay టాటూ: ఆమె పక్కటెముకల మీద నాగ చైతన్య ముద్దు పేరు అని పచ్చబొట్టు వేయించుకున్నారు. రెండు బాణాలు: ఆమె మణికట్టుపై రెండు బాణాల గుర్తు ఉంటుంది. దీని అర్థం "మీ స్వంత వాస్తవికతను సృష్టించుకోండి" ఇదే టాటూ నాగ చైతన్యకు కూడా ఉంది.అయితే నాగ చైతన్యతో విడాకుల తర్వాత, సమంత తన టాటూల పట్ల పశ్చాత్తాపాన్ని వ్యక్తం చేసింది. గతంలో ఇన్‌స్టాగ్రామ్ Q&A సెషన్‌లో ఒక అభిమాని టాటూ ఆలోచనల గురించి అడిగినప్పుడు, ఆమె తన అభిమానులకు సలహా ఇస్తూ "ఎప్పటికీ, ఎప్పటికీ టాటూ వేయించుకోవద్దు" అని చెప్పుకోచ్చింది

## మనసు చెప్పిందే వింటాను..



అగ్ర కథానాయిక దీపికా పదుకొణె దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మధ్య కోల్డ్‌వార్ జరుగుతున్న విషయం తెలిసిందే. ప్రభాస్‌తో సందీప్‌రెడ్డి వంగా తీయబోతున్న 'స్పిరిట్' చిత్రంలో కథానాయిగా దీపికను ముందుగా అనుకున్నారు. అయితే, అనూహ్యంగా ఆమెను తొలగించారు. ఆ తర్వాత తన సినిమాను లీక్ చేసే ప్రయత్నం చేస్తున్నారంటూ సందీప్ రెడ్డి వంగా పెట్టిన ఓ పోస్ట్ చర్చకు దారి తీస్తోంది. ఈ పోస్ట్ దీపికను ఉద్దేశించే అంటూ నెటిజన్లు మాట్లాడుకుంటున్నారు. ఈ వివాదం వేళ దీపికా పదుకొణె తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.ఓ ఫ్యాషన్ షోలో పాల్గొన్న దీపిక.. జీవితంలో ఎదురయ్యే కష్టాలను అధిగమిస్తూ తన నిర్ణయాలకు కట్టుబడి ఉండటం, దృఢంగా ముందుకు సాగడం గురించి మాట్లాడారు. 'జీవితంలో బ్యాలెన్స్‌డ్‌గా ఉండాలంటే నిజాయితీ ముఖ్యం అని భావిస్తా. నేను దానికే ప్రాధాన్యం ఇస్తాను. కష్టమైన పరిస్థితులు ఎదురైనప్పుడు నా మనసు చెప్పిందే వింటాను. తర్వాతే నిర్ణయాలు తీసుకుంటాను. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొంటాను' అని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం దీపిక కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. 'స్పిరిట్'లో తొలుత దీపికా పదుకొణెను కథానాయికగా అనుకున్నారు. దర్శకుడు సందీప్‌రెడ్డి ఆమెకు సినిమా కథ మొత్తం చెప్పారట. అయితే షూటింగ్ టైమింగ్స్, రెమ్యునరేషన్ విషయాల్లో దీపికా చేసిన డిమాండ్స్ సందీప్‌రెడ్డికి కోపం తెప్పించాయట. తాను కేవలం 6 గంటలు మాత్రమే పనిచేస్తానని, 30కోట్ల పారితోషికంతో పాటు అదనంగా జీఎస్టీ చెల్లించాలని, తనతో పాటు 20 మంది సిబ్బంది జీతభత్యాలను నిర్మాతలే చెల్లించాలని, వారికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చూసుకోవాలని దీపిక డిమాండ్ చేసినట్లు ప్రచారం జరుగుతున్నది. అందుకే ఆమెను సినిమా నుంచి తప్పించారని టాక్. ఈ నేపథ్యంలో సందీప్‌రెడ్డి చేసిన తాజా ట్వీట్ సంచలనంగా మారింది. పరోక్షంగా దీపికను ఉద్దేశించే ఆయన ఈ ట్వీట్ చేశారంటున్నారు. 'అధికారికంగా ఒప్పందం చేసుకోకపోయినా.. కథ ఎవరికీ చెప్పొద్దనే నియమాన్ని పాటించాలి. నీపై నమ్మకంతో కథ మొత్తం చెప్పాను. కానీ నువ్వు కథను రివీల్ చేసి నీ నిజస్వరూపం ఏమిటో బయటపెట్టుకున్నావు. ఒక సినిమా కోసం కొన్నేళ్లు కష్టపడాలి. అది నీకు తెలియదు. అర్థం కాదు కూడా. అయినా భయపడేది లేదు. నువ్వు కథ మొత్తం చెప్పినా నాకేమి ఫరక్ పడదు' అంటూ సందీప్‌రెడ్డి వంగా ఫైర్ అయ్యారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్‌గా మారింది.

## 'కన్నప్ప' నుంచి శ్రీకాళహస్తి
# లిరికల్ వీడియో సాంగ్ విడుదల

మంచు విష్ణు ప్రధాన పాత్రలో బాలీవుడ్ డైరెక్టర్ ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'కన్నప్ప'. ఈ మూవీ జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ జోరుగా ప్రమోషన్స్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన మూవీ పోస్టర్లు, పాటలు, టీజర్లు, ట్రైలర్ కన్నప్పపై భారీ అంచనాలు నెలకొల్పాయి. ఇక, ఈ మూవీ ద్వారా మోహన్ బాబు మనవరాళ్లు, విష్ణు కూతుళ్లు అరియానా, వివియానా కూడా తెరంగేట్రం చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే వారి తాలూకు పోస్టర్లను మేకర్స్ విడుదల చేశారు.ం

ఇక, ఈ చిత్రంలో భాగంగా ఈ సోదరిమణులు శ్రీకాళహస్తి స్థలపురాణాన్ని వివరించే లిరికల్ వీడియోను తాజాగా చిత్రబృందం విడుదల చేసింది. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో ఈ పాటను రిలీజ్ చేశారు. కాగా, ఈ చిత్రంలో రెబల్ స్టార్ ప్రభాస్ అతిథి పాత్రలో కనిపించనున్న సంగతి తెలిసిందే. అలాగే మోహన్ బాబు, మోహన్ లాల్, అక్షయ్ కుమార్, శరత్ కుమార్, కాజల్ అగర్వాల్ తదితరులు ఇతర

